విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 17, డిసెంబర్ 2023

ఎస్పీ అన్బురాజన్‌కి డీజీపీ డిస్క్ అవార్డు

విశాలాంధ్ర- అనంతపురం వైద్యం: ప్రతిష్టాత్మకమైన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిస్క్ (డిజిపి డిస్క్ అవార్డు) అవార్డు ఎస్పీ కేకెఎన్ అన్బురాజన్‌కి దక్కింది. రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం మంగళగిరిలో ప్రదానం చేశారు. 2022లో శాంతిభద్రతల పరిరక్షణ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, దిశ కేసుల్లో వేగంగా స్పందించి పరిష్కారం చూపడం, తదితర విభాగాలలో ఎస్పీ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు గుర్తించి పతకం కూడా అందజేశారు. కన్విక్షన్ బేస్ పోలీసింగ్ విధానాన్ని ఎస్పీ అన్బురాజన్ సమర్థవంతంగా నిర్వహించి కీలక కేసుల్లోని నిందితులకు 100 శాతం శిక్ష పడేలా కృషి చేశారు.

తూతూ మంత్రంగా కరువు బృందం పర్యటన

- కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం బాధాకరం
- వలసలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- హంద్రీ నీవా ద్వారా పంటలకు సాగునీరివ్వాలి..
- రాగులుపాడు వద్ద తూముల పని త్వరగా పూర్తి చేయాలి
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

విశాలాంధ్ర-గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ మహాసభలు శనివారం గుంతకల్లు పట్టణం పాతకొత్తచెరువు బస్టాండ్ వద్ద జరిగాయి. సీపీఐ అనుబంధం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్ప యాదవ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులేనిదే రాజ్యం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రజా ప్రతినిధులు చెబుతున్నారే గానీ ప్రజలకు, రైతులకు హాని జరిగితే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అసహనం వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో అనంతపూర్ జిల్లాలో కొన్ని మండలాలను కరువు మండలంగా ప్రకటించారని, అయితే కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఈ ఏడాది సీపీఐ రాష్ట్ర బృందం రాష్ట్ర వ్యాప్తంగా పంటల పరిశీలన, కరువు పరిస్థితులపై పర్యటించడం జరిగిందన్నారు. రెండు రోజుల క్రితం కేంద్ర కరువు సహాయక బృందం జిల్లాలో పర్యటించిందేగాని సరైన రీతిలో రైతుల నుండి పూర్తి వివరాలు సేకరించలేకపోయారని విమర్శించారు. దీంతో రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. నియోజకవర్గంలో పంటలు పండగ అనేక గ్రామాల్లో ప్రజలు వందలాది మంది హైదరాబాద్, గుంటూరు, బెంగళూరు, చెన్నై తదితర మహా నగరాలకు వెళ్లి వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలను అరికట్టడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఉపాధి పనులు 200 రోజులకు పెంచి రూ.600 లు దినసరి కూలీ ప్రకటించాలన్నారు. పంట నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు రూ.30 వేల నుండి రూ.లక్ష వరకు పరిహారం ఇవ్వాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సైతం పంట నష్ట పరిహారం ఇవ్వాలని, హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్నారు. రాగులు పాడు వద్ద తూముల పని త్వరగా పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గం సహాయ కార్యదర్శి రమేష్, గుత్తి, గుంతకల్, పామిడి కార్యదర్శులు గోపీనాథ్, రాందాస్, రాజు, గౌస్, రహీం పాల్గొన్నారు. అనంతరం సభల్లో 16 మంది సభ్యులను కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షుడిగా వెంకట్ రాముడు (గుత్తి) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రహీం (పామిడి), ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు యాదవ్ (గుంతకల్) వీరితోపాటు 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్ఎస్‌సీ టెస్ట్ పేపర్ విడుదల..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: పదో తరగతి పరీక్షలో ఉపయోగపడే ఎస్ఎస్‌సి టెస్ట్ పేపర్ ను శనివారం మండల కేంద్రమైన బొమ్మనహాల్ లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఏఈఓలు వీరన్న, మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు రాజకుమార్‌లో చేతులు మీదుగా విడుదల చేశారు. శనివారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షాలో బాగా ఉపయోగపడుతుం దని చెప్పారు. ఎంతో అనుభవం ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులు తయారు చేసిన మెటీరియల్ టెస్ట్ సిడి గ్రేడ్ ఉపయోగపడుతుందని, మార్కులు స్కోర్ వేయడానికి చాలా ఉన్నతమైన మెటీరియల్ అని తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సమస్యలు పరిష్కారం కోసం విద్యాభివృద్ధిలో ముందుకెళ్తుందని గోవిందరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అంజనేయులు, నాగేంద్ర పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ దారిలో మురుగు తొలగించండి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని నందలపాడు రైల్వే స్టేషన్ కి వెళ్లే రహదారిపై ఉన్న మురుగునీరు తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం మురుగునీటిలో పిచ్చిమొక్కలు నాటి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలపాడు రైల్వే బ్రిడ్జి వద్ద డ్రైనేజీ మురుగనీరు రోడ్డుపై రావడంతో నందలపాడు, రైల్వే స్టేషన్‌కి వెళ్లే ప్రజలు, ప్రయాణికులు తీవ్ర దుర్వాసనతో అల్లాడిపోతున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు మాత్రం ప్రజలనుంచి ఇంటి పన్ను, చెత్త పన్ను తదితర పన్నులు వసూలు చేస్తూ సౌకర్యాల కల్పనలో విఫలం అయ్యారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి సంవత్సరం ఇంటిపై 15% ఇంటిపన్ను అదనంగా పెంచి వసూలు చేస్తున్నారు. కానీ ప్రజలు మాత్రం మురుగనీటిలోనే నెలలు తరబడి దుర్వాసనతో తిరుగుతున్నా చర్యలు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. అధికార, ప్రతిపక్ష నాయకులు నిత్యం ఈ రహదారిపై ప్రచారానికి, ఇతర కార్యక్రమాలకు వెళ్తున్నారే తప్ప కన్నెత్తి చూడటం లేదన్నారు. త్వరితగతిన మురుగునీరు తొలగించాలని లేకుంటే ఇదే రోడ్డుపై స్థానిక ప్రజలను కలుపుకొని వంట వార్పు చేపట్టి రోడ్డు దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ టౌన్ సహాయ కార్యదర్శి నాగేంద్ర, ఏఐటీయూసీ నాయకులు వెంకట రమణ, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

సీపీఐ పార్టీలో 20 కుటుంబాలు చేరిక..

విశాలాంధ్ర-యాడికి: పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామంలో సిపిఐ పార్టీ అనుబంధ సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి. బి.కేశవరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి క్రిష్టిపాడు బాలనాయుడు, ఆధ్వర్యంలో దాదాపు 20 కుటుంబాలను సిపిఐ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షులు టి రంగయ్య అధ్యక్షత వహించారు, ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వ్య.కా.సం జిల్లా ప్రధాన జిల్లాకార్యదర్శి బి కేశవరెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా కేశవరెడ్డి రంగయ్య మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీల కోసం అనేకు ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందపశ్రీన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూము లు నిరుపేదలకు భూ పంపిణీ చేయాలంటే కోనేరు రంగరావు భూ కమిటీ సిఫా ర్సులు అమలు చేసే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి పోరాటాలు చేసి సాధించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పనులు లేక వలసలు పోతున్నారని, అధికారులు ఇప్పటికైనా ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇస్తున్నామని అబద్ధాలు చెబుతూ కాలయాపన చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలు గుర్తించి రాబోయే కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్య.కా.సం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే నాగరాజు, తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.నారాయణరెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, సిపిఐ తాడిపత్రి మండల కార్యదర్శి ఎ.నాగరంగయ్య, పెద్దవడుగు సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, పెద్ద పప్పూరు మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, యాడికి మండల సిపిఐ సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, కాసెట్టినారాయణస్వామి, అల్లా బకాష్ పెద్దవడుగూరు మండలంలో చేరిన వారు మల్లికార్జున, పరూక్, పృథ్వీ, గోపాల్ నాయుడు, చెన్నంనాయుడు ,రాము, తదితరులు పాల్గొన్నారు.

గూప్-1, గ్రూప్-2 ప్రిలిమనరీ పరీక్షకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ఏ.పీపీఎస్‌సీ గ్రూప్-1, గ్రూప్-2 రిక్రూట్ మెంట్ ప్రిలిమనరీ పరీక్షల ఉచిత శిక్షణలకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అర్హులైన వెనుకబడిన తరగతులు (బి.సి), షెడ్యూల్డ్ కులాలు (యస్.సి), షెడ్యూల్డ్ తెగలకు (యస్.టి) చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ బి.సి. స్టడీ సర్కిల్, అనంతపురం సంచాలకులు ఖుష్బూ కొఠారి తెలిపారు. గ్రూప్-2కు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, 100 మంది అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుండి 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండీ, స్టడీ మెటీరియల్ అందజేయబడుతుంది. గ్రూప్-2 అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, 60 మంది అభ్యర్థులకు జనవరి నెల 5వ తేదీ నుండి 60 రోజులపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయబడుతుందని తెలిపారు. డిగ్రీ మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కు లిస్టులు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక అదాయం రూ.1,00,000/ లోపు మాత్రమే), ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచాలని, గ్రూప్-2 అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోపు, గ్రూప్-1 అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు అనంతపురం బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

అంగన్‌వాడీలకు తక్షణమే న్యాయం చేయాలి

అంగన్‌వాడీలు జగన్ బాధితులు : కాలవ

కణేకల్లులో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

విశాలాంధ్ర-కణేకల్లు: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీ టీచర్లు, అయాలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాడని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అయిదు రోజులుగా డిమాండ్ల సాధన కోసం అంగన్ వాడీలు చేస్తున్న పోరాటానికి శనివారం ఉదయం ఆయన కనేకల్లులో సంఘీభావం ప్రకటించారు. రానున్న తెలుగుదేశం ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను తీరుస్తుందని భరోసా ఇచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు కూడా స్పష్టమైన హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2019లో ప్రతిపక్ష నాయకుడి హెూదాలో జగన్మోహన్ రెడ్డి పక్క రాష్ట్రాల కంటే ఏపీలో అంగన్వాడీలకు మెరుగైన జీతాలు ఇస్తానని నమ్మబలికాడన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ ఇంఛార్జి ఉప్పర ఆనంద రాజు, యూనిట్ ఇంఛార్జి చాంద్ పాల్గొన్నారు.

న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలి

విశాలాంధ్ర-పామిడి: గత ఐదు రోజులు నుండి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో చంద్రబాబు అంగన్‌వాడీల సేవలు గుర్తించి ఇళ్ల పట్టాలు అందించి ఇళ్లు మంజూరు చేశారని, కానీ జగన్ రెడ్డి తన పాదయాత్రలో అబద్ధపు హామీలతో తెలంగాణ కంటే 1000 రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తానని మాట తప్పి ఏ అధికారంలేని వాలెంటరీలు సచివాలయ సిబ్బంది చేత అంగన్వాడీ స్కూల్ తాళాలు పగలగొట్టడం చూస్తుంటే.. రాజారెడ్డి రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నాడని మండిపడ్డారు,

మున్సిపల్ వర్కర్లు మద్దతు

విశాలాంధ్ర-రాయదుర్గం రూరల్: స్థానిక మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కార్మికులు శనివారం అంగన్వాడి వర్కర్లు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రమాదంలో మరణించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి సిఐటీయూ నాయకులు అంగన్వాడి వర్కర్లు మున్సిపల్ వర్కర్లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సమ్మెలో ఉన్న అంగన్వాడీలపై బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు. మున్సిపల్ వర్కర్లు భాగస్వాములై ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రాము, వన్నూరు స్వామి, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, తిప్పేరుద్ర పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి...

విశాలాంధ్ర-కూడేరు: మండల కేంద్రంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంపీడీవోకు సిపిఎం, ఏఐకేఎంఎస్ నాయకులతో కలిసి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి రాయుడు, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం మొద్దునిద్ర అవలంబిస్తోందన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు కరీం మల్లికార్జున, చిన్న పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి..

విశాలాంధ్ర-ఉరవకొండ : అంగన్వాడీల సిబ్బంది ఉరవకొండ లో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. కనీస వేతనాలు 26వేలు తగ్గకుండా ఇవ్వాలి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్ లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్ల ఇవ్వాలని ఐసిడిఎస్‌కు బడ్జెట్ ప్రీ స్కూల్ బలోపేతం చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్‌లో నిబంధనలు రూపొందించి ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలని కోరారు.

పామిడిలో మద్దతుతెలుపుతున్న జితేంద్రర్‌గౌడ్..

రాయదుర్గం రూరల్‌లో..

శెట్టూరులో రోడ్డు దిగ్బంధం..

విశాలాంధ్ర-శెట్టూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు అపర్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగనవాడీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమ్మెను నిర్వీర్యం చేయడానికి అధికార యంత్రాంగం ఒత్తిడి చేస్తున్న తలొగ్గేది లేదన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో జాతీయ మానవ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు

విశాలాంధ్ర-బొమ్మనాహాల్: మండలంలోని నెమకల్ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ మానవహక్కుల రాష్ట్ర అధ్యక్షుడు బిఎస్ కృష్ణ రెడ్డి, ఉమ్మడి జిల్లాల జోనల్ కన్వీనర్ నాగార్జున, బొమ్మనాహల్ మండలం అధ్యక్షులు హారేసముద్రం రాముడు, వైస్ ప్రెసిడెంట్ శంకర్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ చంద్రప్పా, ఆలయ సిబ్బంది ఓబన్న పాల్గొన్నారు.

సేల్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పామిడి: పట్టణంలోని పలు కిరాణా షాపులు ఆయిల్ ట్రేడర్స్ ఆటోమొబైల్స్ ఫర్టిలైజర్స్ ఐరన్ మార్ట్లలో శనివారం సేల్స్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తనిఖీలు చేపట్టారు. పట్టణంలో ఐరన్ దుకాణానికి రూ.2 వేలు అపరాధ రుసుము విధించారు. కిరాణా షాప్‌కు రూ.500 అపరాధ రుసుము విధించామని తెలియజేశారు. సేల్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆకస్మిక తనిఖీల్లో చేస్తున్న సమయంలో కొన్ని షాపులు మూతవేశారు. షాపులో నిబంధనలకు విరుద్ధంగా క్రయ విక్రయాలు జరుగుతుంటే లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పట్టణ వ్యాపారులను హెచ్చరించారు.

రాప్తాడు ఎస్ఐగా మునీర్ అహ్మద్..

మునీర్ అహ్మద్..

విశాలాంధ్ర-రాప్తాడు: రాప్తాడు మండలం ఇంచార్జి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.మునీర్ అహ్మద్ బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పీవై ఆంజనే యులు బొమ్మనహాల్ పోలీస స్టేషనుకు బదిలీ అయ్యారు. మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ప్రభుత్వా నికి అనుసంధానంగా ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.

వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నహెూబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

పరిటాల కుటుంబానికి ఎవరి మద్దతు ఉందో..

- ఆర్థికంగా బలుపు, ఆదాయాలు తగ్గలేదు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర-రాప్తాడు: పరిటాల కుటుంబానికి ఎవరి మద్దతు ఉందో... ఆర్థికంగా బలుపు, ఆదాయాలు తగ్గలేదని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్లు వీరిని ఎమ్మెల్యే, మంత్రిని చేసిన రాప్తాడు నియోజకవర్గ ప్రజలను మాత్రం పీడిస్తున్నారు అన్నారు. శాడిజంతోనే రోడ్ల పనులు పూర్తి చేయలేదని వ్యాఖ్యానించారు. గత టిడిపి హయాంలో మొదలుపెట్టి రోడ్లు పూర్తి చేయని గ్రామాలకు మాజీ మంత్రి పరిటాల సునీత వస్తే నిలదీయాలని ప్రజలకు సూచించారు. ధర్మ వరంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అనుకుంటున్నారు కాబట్టే ఎస్కేసీ కంపెనీ రోడ్లలో 19 రోడ్లలో 16 పూర్తి చేశారన్న ఆయన రాప్తాడు నియోజక వర్గంలో మాత్రం 33 రోడ్లకు గాను మూడు రోడ్లు వేశా రంటే 25 ఏళ్లు రాజకీయ భిక్ష పెట్టిన రాప్తాడుపై ఏపాటి ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. బాబు షూరిటీ పేరుతో పరిటాల సునీత గ్రామాలకు వస్తే రోడ్లు పూర్తి చేసి రావాలని అడగాలని ఆమె రాకపోతే టిడిపి నాయకులను నిలదీయాలన్నారు. అప్పటికీ రోడ్లు వేయకపోతే ఓటు అనే ఆయుధంతో మరోమారు బుద్ధి చెప్పాలన్నారు. ప్రేమతో గెలిపించుకున్న నా నియోజకవర్గ ప్రజలకు ప్రేమతో రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం బాధ్యతన్నారు. ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా స్పందిస్తున్నామన్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా కియా వద్ద ఆమె కుటుంబం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూనే ఉంది. అల్లుడు భూములు కొంటూనే ఉన్నాడు. 40 ఏళ్లుగా చేస్తున్న వ్యాపారాలు కూడా సవ్యంగా సాగుతున్నాయన్నారు. సీఎం జగన్ ఆశీస్సులతో 17 వేల ఇళ్లను మంజూరు చేయించుకున్నామని.. మరో 8 వేల ఇళ్ల కోసం కేంద్రానికి పంపామన్నారు. జేజేఎం ద్వారా ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ.150 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో క్రిస్టియన్, మైనార్టీలకు ప్రాధాన్యత..

- సీఎం జగన్‌ను మించిన సెక్యులర్ నేత దేశంలో మరెవ్వరూ లేరు..
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో క్రైస్తవుల ప్రార్థన మందిరం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సూచనల మేరకు పంచాయతీ పాలకవర్గం 15 సెంట్లు స్థలం కేటాయించింది. దీన్ని హర్షిస్తూ ఉరవకొండ నియోజకవర్గ క్రెస్ట్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉరవ కొం డలో విశ్వేశ్వరరెడ్డికి సన్మాన, అభినందన సభ ఏర్పాటు చేశారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో ఎంతో వెనుకబడిన క్రైస్తవుల కోసం క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించడం గర్వకారణం అన్నారు. రాష్ట్రంలో వైస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా అన్ని మతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ వారి బాగోగులు చూసుకుంటున్న సీఎం జగన్‌ను మించిన సెక్యులర్ నేత దేశంలో మరెవ్వరూ లేరని అన్నారు. క్రైస్తవుల అభివృద్ధికి జగన్ అవిశ్రాంత కృషి చేస్తున్నారని,అందులో భాగంగానే చర్చిలు అభివృద్ధి కోసం నియోజకవర్గానికి కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేసారని వెల్లడించారు. క్రైస్తవుల సోదరుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తనవంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలిత, ఎంపీపీ నరసింహులు, జడ్పిటిసి సభ్యులు పార్వతమ్మ, హనుమంతు, వీరితో పాటు వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, క్రెస్ట్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 7 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాలు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండలో మౌలిక సదుపాయాల కల్పన కోసం దాదాపు ఏడు కోట్ల రూపాయలు నిధులు ఖర్చుపెట్టినట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను శనివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడ్డవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఉరవకొండలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. గడపగడప నిధులు కోటి రూపాయలు, ఉపాధి నిధులు రూ.5 కోట్లు, పంచాయతీ తదితర నిధుల ద్వారా అనేక అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వం మంజూరు చేయని విదంగా అత్యధిక నిధులు తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మున్సిపాలిటీకి సమానంగా హైమాస్క్ లైట్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఒక్క డ్రైవర్స్ కాలనీ, లక్ష్మీ నరసింహ కాలనీల్లో రూ.1.5 కోట్లు ఖర్చు చేసినట్లుగా చెప్పారు.

వైకాపా జిల్లా ఎస్టీసెల్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివనాయక్

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని హెచ్ఎస్ తాండా గ్రామానికి చెందిన శివనాయక్‌కు వైకాపా జిల్లా ఎస్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైయారు. శివనాయక్ మాట్లాడుతూ ఎస్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ విప్‌కాపు రామచంద్రా రెడ్డికి, మార్కెట్‌యార్డు ఛైర్మెన్ బోజరాజ్‌నాయక్, మండల కన్వీనర్ వన్నూనరుస్వామికి, మండల వైకాపా కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో యంత్రాల సీజ్

విశాలాంధ్ర-ఉరవకొండ: స్థానిక చంద్రిక మెడికల్స్ పాలీ క్లినిక్ వారి ఆధ్వర్యంలో శనివారంఅనంతపురానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు నిర్వహిస్తున్న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య శాఖ అధికారులు ఆదేశాలతో నిలుపుదల చేశారు. ఉచిత వైద్య శిబిరం జిల్లా వైద్యాధికారి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని జిల్లా అధికారులకు కొంతమంది ఫిర్యాదులు చేయడంతో జిల్లా అధికారుల ఆదేశాలతో డిప్యూటీ డెమో త్యాగరాజు, ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సాహితీ, కుమ్మిది వైద్య శిబిరం దగ్గరకు వెళ్లి 2డి ఎకో పరీక్ష యంత్రాన్ని సీజ్ చేశారు. డిప్యూటీ డెమో త్యాగరాజు మాట్లాడుతూ జిల్లా వైద్యశాఖ అధికారి భ్రమరాంబదేవి ఆదేశాలు మేరకు పరీక్షలు నిర్వహించే యంత్రాలను సీజ్ చేశామని దీన్ని జిల్లా వైద్యశాఖ అధికారికి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నిమ్మల వెంకటేశులు, శేఖర్, కైలాస్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లులో..

విశాలాంధ్ర-గుంతకల్లు : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని శనివారం గుంతకల్ గుంతకల్లులో వందలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం దగ్గర మెస్ బిల్లులు కాస్మోడిక్ చార్జీలు విడుదల చేయాలని ప్లేట్లు పెట్టుకొని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు గతేడాది డిసెంబర్ నుండి రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు కోటి50 లక్షల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెస్‌చార్జీలు 1400 విద్యార్థులకు ఏమాత్రం సరిపోవని, పెరిగిన ధరలకు అనుగుణంగా 1800కు పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశా ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. దాదాపు 5 నెలల నుంచి మెస్ బిల్లులు అకౌంట్లో జమకాక వార్డెన్లు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశ్యారు. ట్రంకు పెట్టెలు ఇవ్వాలని, శిథిలావస్థకు చేరిన హాస్టల్‌లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, కార్పెట్లు ఇవ్వాలని, ప్రతి హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, దోమతెరలు అందజేయాలని, జిల్లా వార్డెన్ పోస్టులు, వర్కర్ల కొరత తీర్చాలని, ప్రభుత్వ జూ.కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం దగ్గర మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వినోద్ కుమార్ వెంకట్ నాయక్ జిల్లా కార్యవర్గ సభ్యులు వేణు గుంతకల్ ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిల శివమణి రాజ్ కుమార్, శ్యామ్,షేక్షావలి, రాజేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం గణేష్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించి అనంతరం డిఆర్వో కొండయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోతులయ్య, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నిరంజన్, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నరసింహ, రాజేష్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..

▶అంగన్వాడీ వర్కర్ల ఉద్యమంలో సచివాలయ ఉద్యోగులు కూడా భాగస్వాములు కండి..
▶ సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్

విశాలాంధ్ర-బత్తలపల్లి: అంగన్వాడీ వర్కర్లు గత ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు తెలిపామని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ సూచించారు. శనివారం బత్తలపల్లికి వచ్చిన ఆయన స్థానిక సచివాలయాలలో పని చేస్తున్న సిబ్బందిని కలిసి వారికి పుష్పాలు అందించి అంగన్వాడీలకు మీరు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. సీపీఐ నాయకులు, చేనేత సంఘం నాయకులు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఉందిరా నిరసన తెలుపుతున్నడంతో వారికి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి అంగన్వాడీ వర్కర్ల వేతనాన్ని పెంచుతామని అదేవిధంగా సమాన పనికి సమాన వేతనం కల్పిస్తామని తెలంగాణలో కంటే అదనంగా ఇక్కడ వెయ్యి రూపాయలు వేతనం పెంచి న్యాయమైన డిమాండ్లు అన్నిటిని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేరుస్తామని హామీ ఇవ్వడం జరిగింది కానీ నేటికీ నాలుగున్నర సంవత్స రాలు అవుతున్నప్పటికీ అంగన్వాడీ వర్కర్ల సమస్యలు ఏమాత్రం పట్టించుకోలేదు ప్రభుత్వం ఏవైతే వాగ్దానాలు ఇచ్చిందో వాటిని వెంటనే అమలు చేయాలని సమ్మెకు దిగారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో అక్రమంగా అంగన్వాడి సెంటర్ల తాళాలను పగలగొట్టి వారితో విధులు నిర్వహించడం ఉద్యమాన్ని అణిచివేయాలనే పద్ధతిలో వ్యవహరిస్తున్నదని, ఈ చర్యలను మానుకొని న్యాయమైన తమ డిమాండ్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, మండల కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కుళ్లాయప్ప, పట్టణ కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శులు రమణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకట స్వామి, వెంకటనారాయణ, పూల లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, ఆది మండల సహాయ కార్యదర్శి ఓబులేష్, సత్యఅప్ప, రామకృష్ణ, జయమ్మ, సావిత్రమ్మ, నారాయణ, ఫవలయ, మరెక్క పాల్గొన్నారు.

అభివృద్ధికి కాదు.. అరాచానికే టీడీపీ అడ్డు

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

విశాలాంధ్ర-ధర్మవరం: అభివృద్ధికి కాదు... ఎమ్మెల్యే కేతిరెడ్డి అరాచకానికే టీడీపీ అడ్డుపడుతోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డిని చూసి ధర్మవరం ప్రజలు భూతంలా భయ పడుతున్నారని, గుడ్‌మార్నింగ్ కార్యక్రమాలకు ప్రజలు గుడ్‌బాయ్ చెబుతున్నారని, ధర్మవరంలో ధర్మాన్ని కాపాడిందని ఇచ్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి చేసే ప్రతి మాట విడ్డూరంగా ఉందన్నారు. జిల్లేడు బండ ప్రాజెక్టు ఒకటి చాలు అని అన్నారు. మరి నాలుగు గ్రామాలను 1700 ఎకరాలను ముంచేస్తూ ప్రాజెక్టు కడుతుంటే కనీసం నిర్వాసితులతో మాట్లాడాల్సిన అవసరం లేదా అని నిలదీశారు. వారికి పరిహారం ఇవ్వకుండా అంతా హడావుడిగా ఎందుకు పనులు చేస్తున్నారని వారు మరోసారి ప్రశ్నించారు. ఎప్పుడూ కూడా టిడిపి బాధితుల పక్షా అనే నిలబడుతుంది అన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించాలని తెలిపారు. తాడిమర్రిలో ఏళ్ల తరబడి ఉంటున్న ఇళ్లను నిర్దాక్షిణంగా కూల్చివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా కదిరి రైల్వే గేట్ దగ్గర ఆర్ఓబీ బ్రిడ్జి విషయంలో కూడా అలాగే ఎమ్మెల్యే వ్యవహరించారని.. ప్రజలను ఇలా అడుగడుగునా బాధపెడుతూ నష్టపరుస్తూ ప్రతిపక్షంగా స్పందించే తమపై బురద చల్లడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇక పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను ఎనిమిది కోట్లు గుడ్ విల్ తీసుకుని ఏడున్నర కోట్లతో నిర్మించారని అది ఎవరికైనా ఉపయోగపడుతోందా అని నిలదీశారు. వైసీపీ ప్రభుత్వం సామాన్యులకు నివాస యోగ్యం కాని చోట స్థలాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ధర్మవరంలో మైనార్టీల మనోభావాలు దెబ్బతినేలా కూల్చివేస్తే తాము ప్రశ్నిస్తే అభివృద్ధికి అడ్డుపడినట్లా అని నిలదీశారు.

అంగన్వాడీలకు న్యాయం చేయాల్సిందే

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపబోమని సిఐటీయూ నాయకులు అంగన్వాడీ టీచర్స్ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో భిక్షాటన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. తదుపరి నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల జీతాలు పెంపు గ్రాజిటీ చెల్లించాలని, ప్రభుత్వ పథకాలను మారుమూల ప్రాంతాలకు చేరవేయడంలో సరిఅయిన పోషక ఆహారం అందించడంలో అభిజ్ఞాన నైపుణ్యాలను బోధించడంలో అంగన్వాడీ కార్యకర్తల కీలకపాత్ర ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, అయుబ్ ఖాన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, సీనియర్ నాయకులు ఎస్హెచ్ భాష, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, ట్రాన్స్పోర్ట్ రంగం నాయకులు రఫీక్, మారుతి, వెంకటస్వామి, అంగన్వాడి ధర్మవరం ప్రాజెక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రకళ, పోతక్క, దీన, అరుణ, రత్నమ్మ, అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి లలితా తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో చేనేతల ఉనికి చాటుదాం..

విశాలాంధ్ర-ధర్మవరం: చట్టసభల్లో చేనేతల ఉనికిని చాటేందుకే రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ధర్మవరం పట్టు చీరల తయారీ సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి, గౌరవాధ్యక్షులు పోలా వెంకటనారాయణ తెలిపారు. శనివారం పట్టణంలోని సెమీ నారాయణ స్వామి దేవాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ పట్టణంలోని వాసవి గుడి ఎదురుగా గల అర్జున్ ఫ్యాబ్రిక్స్ రిటైల్ వ్యాపార సంస్థను కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దంపతులచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని ప్రణవ్ ఫంక్షన్ హాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జాతీయ చేనేత అధ్యక్షులు అనంతప్రసాద్, కర్నూలు ఎంపీ.సంజీవ్ కుమార్, మాజీ ఆప్కో చైర్మన్ చిరంజీవి, మాజీ ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ జిల్లాల నుండి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, చేనేత కుల సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. చేనేత పరిశ్రమలు కాపాడుకునేందుకు పాటించాల్సిన విధివిధానాలు, ఎమ్మెల్యేగా అవకాశాలు కల్పించుట, చేనేత వ్యాపారులపై దాడులు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తీర్మానం చేయబడుతుందని తెలిపారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా వివిధ ప్రభుత్వాలు పరిపాలనలో చేనేతల ఉనికిని మరిచి పోవడం దారుణమన్నారు కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం పార్థసారథి, గిర్రాజు నగేష్, కార్యదర్శి హేమంత్ కుమార్, సుందరేసన్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో మంచి విజ్ఞానం

డీఈఓ మీనాక్షి దేవి

విశాలాంధ్ర-ధర్మవరం: వైజ్ఞానిక ప్రదర్శనలు మంచి విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని డీఈఓ మీనాక్షిదేవి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలు 10, 18 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం నిజంగా సంతోషించదగ్గ విషయమని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనకు సహాయ సహకారాలు అందించిన ఆయా పాఠశాలల హెచ్ఎం లకు ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మూడు ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం. సుమన పాల్గొన్నారు.

సాగులో ఉన్న రైతులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: మండలంలోని రేగాటిపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన వందల ఎకరాల భూములు అన్యాయంగా గత 20 సంవత్సరాల నుండి సాగులో ఉన్న రైతులకు కాకుండా ఇతర వ్యక్తులకు ఇవ్వడం దారుణమని రేగాటిపల్లికి చెందిన చిలకం సూర్యనారాయణ రెడ్డి, శేఖర్, బిజెపి పట్టణ రూరల్ అధ్యక్షులు డిష్ రాజు, అరవింద రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుస్సా కృష్ణ నారాయణస్వామి యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ యుగేశ్వరిదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించిన వందల ఎకరాల భూములు ఏళ్ల తరబడి సాగులో ఉన్న రైతులకు మాత్రమే వర్తిస్తుందని, అలాకాకుండా ఇతరులకు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు అన్ని వర్గాల వారికి ఆ భూముల పట్టాలు పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సయ్యద్ బాబయ్య, నబి రసూల్, సరితాళ దస్తగిరి, చింతా జగదీష్, లక్ష్మీనారాయణ, అశ్వత్థ నారాయణ, నాగరాజు, ఆదెప్ప, హరి, సూర్యనారాయణ, రామకృష్ణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, సూరి, రాము, రవి పాల్గొన్నారు.

బీసీల భరోసా బాటను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న రజక సాధికారత సమితి ఆధ్వర్యంలో రజకుల సమావేశాన్ని విజయవంతం చేయాలని రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గుర్రపు శాల రామకృష్ణ, హిందూపూర్ పార్లమెంటు కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి, గాండ్లపర్తి రాము, అనంతపురం వెంకటేష్ కోరారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరాములు అనంతపురంలోని ఆయన నివాసంలో కలిసి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరగా వస్తానని హామీ ఇచ్చారు.

బత్తలపల్లిలో సీపీఐ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-బత్తలపల్లి: మండల కేంద్రంలో నూతన సిపిఐ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, మండల కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కుళ్లాయప్ప, పట్టణ కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శులు రమణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, పూల లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, ఆది మండల సహాయ కార్యదర్శి ఓబులేష్, సత్యఅప్ప, రామకృష్ణ, జయమ్మ, సావిత్రమ్మ, నారాయణ, ఫవలయ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్

విశాలాంధ్ర - అగళి : మండలంలోని ఎం ఎం పాల్యం గ్రామ నివాసి, హెచ్. డి. హళ్లి మాజీ సర్పంచ్ రాజ కుమార్ (ప్రింటింగ్ ప్రెస్ రాజన్న)ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. మడకశిర నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి..

విశాలాంధ్ర-కొత్తచెరువు: ట్రాఫిక్ నియమ నిబంధనలను వాహనదారులు ప్రజలు తప్పని సరిగా పాటించాలని చైతన్య పాఠశాలల ఉమ్మడి జిల్లాల ఏజీఎం సుబ్బారెడ్డి, ఎస్సై సురేష్ బాబు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై పాఠశాల విద్యార్థులు బ్యానర్లు ప్లే కార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు.

నరేంద్ర మోడీ నేతృత్వంలోనే దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలు

కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్

విశాలాంధ్ర-అగళి : నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా విరివిగా సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామంలో శనివారం వికసిత్ భారత్ ప్రచార కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ సోనిబాయి నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు అందుతున్న సంక్షేమ పథకాలను టీవీ ప్రచారం ద్వారాప్రజలకు వివరించారు. దారిద్రరేఖ దిగువ వున్న కుటుంబాలకు ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కలెక్షన్ కింద 40 మందికి గ్యాస్ కనెక్షన్ మంజూరు చేసినట్లు తెలిపారు. అంత్యోదయ అన్న యోజన పథకం కింద గ్రామపంచాయతీలోని అన్ని కుటుంబాలకు ప్రతి నెలా ఒక మనిషికి 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు. మొదటిసారిగా గర్భిణీ దాల్చిన స్త్రీలకు పంచాయతీలో 80 మందికి ఆరువేల రూపాయలు రెండవ విడత కింద 150 మందికి కూడా 6 వేలు చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి 14,15 సంఘం నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. గ్రామ పంచాయతీలోని 4 అంగన్వాడీ సెంటర్లలో ప్రతినెల గర్భవతులు బాలింతలు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు పంచాయతీలోని పాఠశాలలకు సర్వశిక్ష అభియాన్ నుంచి పాఠశాల మరమ్మత్తులు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

నారా లోకేష్ స్ఫూర్తి యువతకు ఆదర్శం...

టీడీపీ అధ్యక్షుడు బికె పార్థసారథి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బికే పార్థసారథి మాట్లాడుతూ యువగళం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి అవుతున్న సందర్భంగా అభినందనలు. యువగళం జనగళంగా మారింది. యువత కోసం, యువత భవిత కోసం ఈ పాదయాత్రను ప్రారంభించినప్పటికీ అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. లోకేష్ సభలకు, సమావేశాలకు ప్రజలంతా స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు పలికారు. ప్రజలంతా తమ సమస్యలను లోకేష్‌కి చెప్పుకొన్నారు. లోకేష్ మాటలు వారికి భరోసానిచ్చాయి. నిరాశ, నిస్పృహలతో వున్న ఆంధ్రా ప్రజలకు లోకేష్ ఆశాకిరణంలా కనిపిస్తున్నారని తెలిపారు. నారా లోకేష్ పాదయాత్ర పెనుకొండ నియోజకవర్గములో గుట్టూరు వద్ద 700 కిలోమీటర్ల మైలురాయి చేరుకొన్న సందర్భంగా గోరంట్ల, మడకశిర ప్రాంతాల్లో నెలకొన్న తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి హంద్రీనీవా కాలువ నుండి ఎత్తిపోతల పథకం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతానికి ఇచ్చిన మాట నారా లోకేష్ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత తప్పకుండా నెరవేర్చుతారని తెలిపారు. నారా లోకేష్ పాదయాత్ర ముగింపు సభ విజయనగరం జిల్లా, నెల్లిమర్ల నియోజకవర్గం, భోగాపురం మండలం, పోలిపల్లి గ్రామంలో ఈనెల 20వ తేదీన జరుగుతుందని తెలిపారు.

టెండర్ ఫారాల విక్రయాలు.. డిపో మేనేజర్ : సత్యనారాయణ

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 16వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ధర్మవరం డిపో మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారములు విక్రయించడం జరుగుతుందని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ టెండర్ ఫారం ధర 885 రూపాయలు ఉంటుందని, ఆ ఫారమును భర్తీ చేసిన తర్వాత ఈనెల 28వ తేదీ గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం- పుట్టపర్తి నందు ఉదయం పదిన్నర గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ బాక్స్ నందు వేయవలెనని వారు తెలిపారు. తదుపరి మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్స్ తెరవబడునని తెలిపారు. ఈ టెండర్ ఫార్ములకు ధర్మవరం డిపో నందు ఖాళీగా ఉండు వ్యాపారమునకు అనువైన దుకాణముల కొరకు ఔత్సాహికులైన వ్యాపారస్తుల నుండి టెండర్లను కోరుతున్నామని తెలిపారు. ఖాళీగా ఉన్న స్థలములలో టీ, కాఫీ అండ్ హార్డ్ డ్రింక్స్, స్టోర్ రూమ్, కంప్యూటర్ స్టిక్కర్ లైన్, అండ్ ఫ్లెక్సీ బ్యానర్స్, జిమ్ సెంటర్, డార్మెంటరీ వాటికి మంచి అనుకూలం ఉంటుందని తెలిపారు. కావున ఆసక్తిగల వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బాల్ బాడ్మింటన్ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎస్.మనోజ్ ఎంపిక..

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ శ్రీకాకుళం జిల్లా కేసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.మనోజ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికి ఎంఎకయ్యాడని ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర, హెడ్మాస్టర్ శైలజ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర పర్యవేక్షణలో జాతీయ స్థాయికి ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. విద్యార్థి మనోజును జాతీయ స్థాయిలో రాణించటానికి మరింత నైపుణ్యంతో బాధ్యతలు నిర్వహించాలన్న తలంపుతో ఉపాధ్యాయుడు శేషు రూ.3 వేలు విలువచేసే ఫైబర్ బాల్ బాడ్మిం టన్ బ్యాట్స్ అండ్ రూ.1800 బాల్స్‌ను రిటైర్డ్ టీచర్ జయసింహ అందజేశారు. జైసింహ మాట్లాడుతూ పిడి. నాగేంద్ర ప్రయత్నానికి స్పందించి విద్యార్థికి జాతీయ స్థాయిలో గెలవడానికి మా సహకారాన్ని అందిస్తున్న అందులకు ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం హెచ్ఎం శైలజ, పీడీ నాగేంద్ర, హిందీ పండిట్ వేణుగోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర బృందం, విద్యార్థి మనోజును అభినందించి, హర్షం వ్యక్తం చేశారు. దాతగా ముందుకు వచ్చిన రిటైర్డ్ జయసింహకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు...

మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి

విశాలాంధ్ర-గోరంట్ల: టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి తెలిపారు. మండలంలోని కరావులపల్లి, కరావువులపల్లి తాండ నందు "బాబు ష్యూరిటి-భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమం పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే "ఆడబిడ్డనిధి" పేరుతో 19 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు గల మహిళలు ప్రతి ఇంటిలో ఎంత మంది ఉంటే అంత మందికి నెలకు 1500 ఇస్తామని తల్లికి వందనం, పేరుతో ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి సంవత్సరానికి 15 వేలు ఇస్తామని నిరుద్యోగ యువతకు, ప్రతీ నెల యువగళం పేరుతో నెలకు 3 వేలు ఇస్తామని, మనకు అన్నంపెట్టే రైతుకు "అన్నదాత" పేరుతో సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని ప్రతీ ఇంటికీ దీపం పథకం ద్వారా అర్హులైన ప్రతీ ఇంటికి 3 గ్యాస్ సిలిండర్స్ ఉచితంగా ఇస్తామని, మహిళలకు జిల్లాలో ఉచితంగా ఆర్టీసీ బస్ ప్రయాణ సౌకర్యం కలిపిస్తామని మరిన్ని సంక్షేమ పథకాలు మళ్ళీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటిస్తారని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, పార్లమెంట్ కార్యదర్శి దేవా నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి,జిల్లా కార్యదర్శి బీరే వేణుగోపాల్ రాయల్, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, మాజీ చందమూరి గోపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జయరామ్, రవినాయక్, శ్రీనివాసులు, గంగిరెడ్డి, ఉమర్‌కన్. సుబ్బరాయుడు.నీల కాంతారెడ్డి, కమ్మవారిపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

సంఘీభావం తెలిపిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ మండలం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు తమ హక్కులకై నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మడకశిర తెదేపా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అంగన్వాడీ కార్యకర్త లకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చిన విధంగా అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కదం తొక్కిన అంగన్వాడీ కార్యకర్తలు

నల్లమాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

విశాలాంధ్ర-నల్లమాడ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఓబులదేవరచెరువు, ఆమడగూరు, నల్లమాడ మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు వైస్సార్ సర్కిల్ వద్ద నుండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రనాథ్ యాదవ్, తహసీల్దార్ దేవేంద్ర నాయక్ వినతి పత్రాన్ని అందచేశారు. ఐదు రోజుల నుంచి జరుగుతున్న సమ్మెను భగ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దౌర్జన్యకాండ పద్ధతులను నిరసిస్తూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు సీపీఐ మండల కార్యదర్శి వెంకట రమణ తమ మద్దతు పలికారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, లక్ష్మి నారాయణ, టీచర్ రంగమ్మ, మేరీ సుజాత, ఆయాలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర-ఎన్‌పికుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం అంగన్‌వాడీ, ఆయాలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అంగన్వాడీల మౌన దీక్ష

విశాలాంధ్ర-తాడిమర్రి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడిమర్రిలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మౌన దీక్ష నిర్వహించారు. ఎన్నికల ముందు మాకు ఇచ్చిన హామీని మాత్రమే నెరవేర్చాలని కోరారు. ఉన్నతాధికారులు కేంద్రాలలోకి చొరబడి సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ద్వారా తాళాలు పగలగొట్టి కేంద్రాలను తెరుస్తున్నారన్నారు. అయితే వీటివల్ల ఒరిగిందేమని ప్రశ్నించారు. తమకు తక్షణమే న్యాయం చేయాలని కోరారు.

చెవిలో పూలతో వినూత్న రీతిలో నిరసన

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బలో తాహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన వాడీ సిబ్బంది చేపట్టిన ఐదవ రోజు నిరాహార దీక్షల కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీ నర్ బాసినేని ప్రభాకర్, సిఐటీయూ, సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న, బండల వెంకటేష్, పోతలయ్య పాల్గొని మద్దతు పలికారు. చెవిలో పూలు పెట్టుకొని అంగన్ వాడీలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి కల్లబొల్లి మాటలు చెప్పి అంగనవాడీ కార్యకర్తలకు చెవిలో పూలు పెట్టాడని మండిపడ్డారు.

పెనుగొండలో..

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 17,డిసెంబర్ 2023

అంగన్వాడి టీచర్లు మౌన దీక్ష

విశాలాంధ్ర-తాడిమర్రి:మండల పరిధిలోని తాసిల్దార్ కార్యాలయ ముందు ఆవరణములో గత ఐదు రోజులుగా అంగన్వాడీ టీచర్లు తమ సమస్యల పరిష్కారం కొరకై నిరసనలు తెలుపుతున్నారు.ఇందులో భాగంగా శనివారం మౌన దీక్షతో తమ నిరసనను తెలియజేశారు.ఈ దీక్షలకు సీఐటీయూ, సిపిఐ వారు మద్దతు పలికారు.అనంతరం అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ గత ఐదు రోజులుగా తాము చేస్తున్న ధర్నాకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణం అన్నారు. అంతేకాకుండా సమస్యలు వినడానికి చర్చలు కూడా ప్రభుత్వం పిలువ లేకపోవడం బాధాకరమన్నారు. తొలుత తాడిమర్రి మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్లి దీక్షలను పూనుకున్నారు. మా సమ్మెను అణిచివేసేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మానుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల తాళాలను పగలగొట్టి స్వాధీనం చేసుకోవడం ఇది పద్ధతి కాదని వారు హెచ్చరించారు. మా సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఎంత దూరమైనా,ఎన్ని పోరాటాలైన వెళతామని తెలిపారు. ప్రభుత్వం పంతం నెగ్గాలని అంగన్వాడీలను సహాయకులను అణిచివేయాలని చూస్తే ఈ ప్రభుత్వాన్ని ఎదిరించే శక్తి అంగన్వాడీలకు ఉందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రూప్-1, గ్రూప్-2 ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల గ్రూప్-1 గ్రూప్-2 రిక్రూట్మెంట్, ప్రిలి మనరీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్టడీ సర్కిల్ సంచాలకులు కుష్బూ కొఠారి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ గ్రూప్-2 కు ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని ఎంపికైన వారికి ఈనెల 25వ తేదీ నుంచి 45 రోజులపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ మరియు స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే గ్రూప్-1 అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఎంపికైన అభ్యర్థులకు జనవరి నెల 5వ తేదీ నుండి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల యొక్క ఎంపిక విధానం డిగ్రీ నందు మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా తో పాటు 10వ తరగతి, ఇంటర్ మరియు డిగ్రీ మార్కుల లిస్టు, కుల ధృవీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, జతపరిచి గ్రూప్-2 అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోపల గ్రూప్-1 అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోపల ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సహాయ సంచాలకుల కార్యాలయంలో అనంతపురం కలెక్టరేట్ ప్రక్కనే ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజే యాలన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల రక్షణ చట్టం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

విశాలాంధ్ర- అనంతపురం రూరల్: టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల రక్షణ చట్టం తీసుకువచ్చి వారికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శనివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రజక సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా మాజీ ప్రభాకర్ చౌదరి హాజరై మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి రజకులు టీడీపీతోనే ఉన్నారన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు గ్యారెంటీ కోసం సూపర్ సిక్స్ పథకాలు ప్రభుత్వం రాగానే అమలు చేస్తామన్నారు. రజకుల అభివృద్ధికి అన్ని విధాల టీడీపీ కృషి చేస్తుందన్నారు. గతంలో ధోబిఘాట్ లు నిర్మించి, నీటి సౌకర్యం కల్పించి, ఆదరణ పథకం కింద పనిముట్లు అందజేశామన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపిని గెలిపించి చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రజక సాధికార రాష్ట్ర కన్వీనర్ గుర్రపుసాల రామకృష్ణ, మాజీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవర్ల మురళి, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, సైఫుద్దీన్, పార్లమెంట్ రజక సాధికార కమిటీ కన్వీనర్ రమేష్ బాబు, గంగానగర్ వెంకటేష్, శోభ, కసాపురం కృష్ణమూర్తి, నారాయణస్వామి, బోయగిరి కృష్ణ, గోపాల్, నాగేంద్ర, తనుష్, నంద, ఓబులేసు, భాస్కర్, పరమేష్, ఆది, చంద్రశేఖర్, సుంకన్న, గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకటేశులు మృతి

మాజీ మంత్రి కాలవ నివాళి

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని మైలాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వెంకటేశులు (65) శుక్రవారం రాత్రి మృతి చెందారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి చురుకుగా పనిచేసారు. కోళగానహనళ్లి, మైలాపురం గ్రామాలకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశారు. కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి ఇంటి వద్దనే మృతి చెందారు. శనివారం మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటేశులు మృతి చెందడం చాలా దురదృష్టకరం అన్నారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, ఎస్సి నాగరాజు, మాజీ కన్వీనర్ చలపతి, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ, మాజీ డైరెక్టర్ మహేంద్ర , పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్ తదితరులు నివాళులు అర్పించారు.

10 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

రూ. 53,160/- నగదు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా ఎస్పీశ్రీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం రూరల్ ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఎం.కొత్తపల్లి అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరి నుండీ రూ. 53,160 నగదు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

స్పింకర్ల దొంగలు అరెస్టు

- ▶▶46 స్పింకర్లు పైపులు స్వాధీనం
- ▶▶కూడేరు పోలీసులను అభినందించిన ఎస్పీ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు రైతులకు సంబంధించిన స్పింక్లర్లు దొంగలించిన ఇద్దర్ని కూడేరు పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండీ 46 స్పింకర్లు పైపులు స్వాధీనం చేసుకున్నారు. కూడేరు ఎస్సై సత్యనారాయణ, పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

ఈనెల 20 నుండి నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: విద్యాశాఖలో పని చేస్తున్న సర్వ శిక్ష ఉద్యోగులు సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సర్వ శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మంజప్పా, ఇస్మాయిల్ అన్నారు. ఈనెల 20 నుండి సర్వ శిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నిరావధిక సమ్మెలో వెళుతున్నట్టు శనివారం బొమ్మనహాళ్ మండల విద్యాధికారులు వీరన్న, మల్లికార్జునలకు నిరావధిక సమ్మె నోటీసును అందించారు. శనివారం నుండి పెన్డౌన్ చేసినట్టు వారు తెలిపారు. సర్వ శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమస్యలు పరిష్కరించే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియాలజీలో వైద్య విద్యా సదస్సు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : ప్రభుత్వ వైద్య కళాశాల అనంతపురంలోని శరీర ధర్మ శాస్త్ర విభాగం ప్రధాన విభాగాధిపతి డాక్టర్ సరళ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా సదస్సును నిర్వహించారు. ఊపిరితిత్తుల విధుల పరీక్షలు మరియు వ్యాధి నిర్ధారణ,వాటి క్లినికల్ పరీక్షల పైన పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు నిర్వహించే నిరంతర వైద్య విద్యా సదస్సును ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన గావించి లాంచనంగా ప్రారంభించారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి సుమారు వంద మంది వరకు పాల్గొన్నారు. ఈ సదస్సులు డాక్టర్ పావని, డాక్టర్ శ్రీధర్ రావు, డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ సరళ, డాక్టర్ ఇందిర, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ రాధిక తదితరులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తరగతులు నిర్వహించారు. ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ నిరంతరం వైద్య విద్యా సదస్సుల ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు నూతన వైద్య విద్యా పద్ధతులను, పరిశోధనలను తెలుసుకునేందుకు వీలుంటుందని, ఎక్కువగా పరిశోధనలు జరిపితే అద్భుతమైన ఆవిష్కరణలు కనుగొనేందుకు వీలవుతుందని తెలిపారు. చాలా బాగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఫిజియాలజీ విభాగం వారిని అభినందిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ సరళ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఇందిర, డాక్టర్ రాధిక, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ శ్రావ్య కీర్తి, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు డాక్టర్ ఎడ్విన్ ఇజ్రా పాల్, డాక్టర్ సెల్వకుమార్, డాక్టర్ అర్చన దేవి, డాక్టర్ నితిన్ శర్మ, డాక్టర్ ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ లీగల్ సెల్ సమావేశానికి ఆహ్వానం

విశాలాంధ్ర-పెనుకొండ: అనంతపురం జిల్లా మరియు సత్య సాయి జిల్లా వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ సమన్వయ కమిటీ మీటింగ్ అనంతపురం నందు 23వ తేదీన జరుగుచున్నది దీనికి ముఖ్య అతిథిగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరియు ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు అందరూ హాజరవుతున్నారు, దీనికి సంబంధించి శనివారం జోనల్ ఇంచార్జ్ లోకేశ్వర్ రెడ్డి వైఎస్ఆర్సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు ఉమాపతి మరియు సత్యసాయి జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి పెనుకొండ బార్ హాల్ నందు బార్ అసోసి యేషన్ అధ్యక్షులు నాగరాజుతో కలిసి సమావేశము నిర్వహించి, వైఎస్సార్సీపీ న్యాయవాద కుటుంబ సభ్యులను ఆహ్వానించారు సమావేశంలో చర్చించే అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వారు ఇటీవల ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా నియమించబడినందున బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివశర్మ, మోహన్ నాయక్, శ్రీనివాసులు, విక్రాంత్ నాయక్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అశ్వత్థ నారాయణ, ఏజిపి భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి బాలాజీ, జావిద్, నాగార్జున, గొల్ల లక్ష్మీనారాయణ, హరి,తదితరులు పాల్గొన్నారు.

భాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కూడేరు: కూడేరు మండలం గొట్కూరు గ్రామంలో శనివారం మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి పర్యటించారు. పలువురుని పరామర్శించారు. వైస్సార్సీపీ నాయకులు దామోదర్ రెడ్డి ఇటీవలే గుండె పోటుతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి క్యాన్సర్ తో బాధపడుతున్నారు.ఆయనను విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. ఈ పరామర్శ లో మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు మదన్మోహన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి,సర్దార్, తోపుదుర్తి రామంజి, గోవిందు, నాగిరెడ్డి ఉన్నారు.

విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన పోటీలు

విశాలాంధ్ర-అమడగూరు: స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం మండలంలోని కె.జి.బి.వి. పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు ఎం.ఇ.ఒ. జిలాన్ భాష, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ అధ్యక్షతన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఇ.ఒ.జిలాన్ భాష మాట్లాడుతూ విద్యార్థులు కనబరిచిన ప్రాజెక్టుల గురించి వారికి ఈ ఆలోచన ఎలా వచ్చింది, ఈ నేపథ్య శోధన గురించి వారు ఏమి నేర్చుకున్నారు. వారు చేసిన పరికరం ఎంత సమయం పట్టిందని, వారి వారి ప్రతిభల ఆధారంగా తీర్పు నిచ్చి, పోటీలో విజయం సాధించిన మొదటి బహుమతిని గుండువారిపల్లి కె.జి.బి.వి. పాఠశాల విద్యార్థులకు, రెండవ బహుమతి అమడగూరు పాఠశాల విద్యార్థులకు, మూడవ బహుమతి మోడల్ స్కూల్ విద్యార్థులకు స్థానిక ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఎం. ఇ.ఒ.లు విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, ఎం. ఆర్.సి.సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువులోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించి ఈరోజు గ్రామంలోని ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందలాదిమంది అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొని భోజనాలు నిర్వహించారు.

19 నుంచి వికసిక్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర-ఎన్ పీ కుంట: గ్రామ స్వరాజ్ అభియాన్, కేంద్ర ప్రభుత్వాల పథకాల గురించి అవగాహన , అర్హత ఉండి అర్హులుగా ఎంపిక కాకపోతే వారి కోసం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను మండలములో ఈనెల 19 నుంచి మండల అన్ని పంచాయతీలలో నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ ఆదినారాయణ పేర్కొన్నారు. 19న మంగళవారం ధనియాన్ చెరువు, వంకమద్ది ,20 న నంబులపూలకుంట మర్రికొమ్మదిన్నె, 21 న తూర్పు నడింపల్లి , గౌకనపల్లి, 22న వెలిచలమల, పడమరనడిమిపల్లి, 23 న మేకల చెరువు, తిమ్మమ్మ మర్రిమాను, 24 న బలిజపల్లి, పి కొత్తపల్లి, 25 న పెడబల్లి, ఎదురుదోన గ్రామపంచాయతీలలో గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఉన్నట్లయితే సంబంధిత ఆధారాలతో గ్రామసభలో పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభలను జయప్రదం చేయాలని ప్రజలకు వివరించారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర-కణేకల్లు: వైసిపి నాయకులు మానప్ప ఆచారి పార్థవ దేహానికి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి , జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ కాపు భారతిలు. కణేకల్ మండలం బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మానప్ప ఆచారి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, కాపు రామచంద్రారెడ్డి శనివారం వారి స్వగ్రామంమైన బ్రహ్మసముద్రం గ్రామంలోని వారి స్వగృహంకు చేరుకొని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవున్ని ప్రార్థిస్తూ ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మానప్ప ఆచారి పార్టీ కోసం ఎంతో కృషి చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మానప్ప ఆచారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు.

టీడీపీ లోకి రండి ...సముచిత గౌరవం ఇస్తాం

గంపల రమణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానించిన బీకే పార్థసారథి



విశాలాంధ్ర-గోరంట్ల: తెలుగు దేశం పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం,గౌరవం దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి తెలిపారు, ఈ సందర్భంగా టిడిపి టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి ఆధ్వర్యంలో బాబూ షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ను కరావులపల్లి,కరావుల పల్లి తండా గ్రామాలలో నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన వైసీపీ సీనియర్ నాయకులు,మాజీ స్టీరింగ్ కమిటీ సభ్యులు,మాజీ సింగిల్ విండో అధ్యక్షులు గంపల రమణా రెడ్డి స్వగృహానికి చేరుకొని టిడిపి పార్టీ లోకి రండి,మీకు సముచిత స్థానం, గౌరవం ఇస్తాం అన్నారు,ఆలోచించి,నాయకులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని గంపల రమణారెడ్డి బీకే కు తెలిపారు,దీంతో సమయం లేదని,ఎన్నికలకు మూడు నెలలే గడువు వుందని,మీరు వెంటనే నిర్ణయం తీసుకొని,టిడిపి లోకి రావాలని,చింతా గోపాల్ రెడ్డి ని,గంపల రమణా రెడ్డి నీ కోరారు, ఈ కార్య క్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడు పుట్టినరోజుకి ఉచిత అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: తెలుగుదేశం పార్టీ నాయకులు సవిత భర్త వెంకటేశ్వర రావు జన్మదిన సందర్భంగా అన్నా క్యాంటీన్ నందు ఉచిత అన్నదాన కార్యక్రమనీ నిర్వహించారు. వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద ఎత్తున ప్రజల వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేస్తూ అలాగే రాత్రికి అయ్యప్ప స్వాములకు వడి పూజ స్వాములకు భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని దేవాలయాలు పూజా కార్యక్రమాలు నిర్వహించమని ఆయన అభిమానులు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో వెలిసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలలో భాగంగా శనివారం రెండవ రోజు 108 పచ్చి టెంకాయల జలముతో స్వామి వారికి అభిషేకం, సత్యనారాయణ వ్రతం, లక్ష్మి నారాయణ హెూమము,పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను తిలిపించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.